క్లుప్తంగా

ఉచితంగా రక్త పరీక్షలు



మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్న నిర్వాహకులు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మధుమేహ వ్యాధిగస్తులకు రమణ క్లినికల్ లేబరేటరీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించారు. షుగర్ నిర్ధారణ పరీక్షల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలపై లేబరేటరీ నిర్వాహకుడు ఎల్.కృష్ణమూర్తి అవగాహన కల్పించారు. ఆహార నియమాలు పాటించడంతో పాటు వ్యాయామం ద్వారా మధుమేహం నియంత్రణలో ఉంటుందని వివరించారు. వైద్యులు సూచన మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి

కాకినాడ రూరల్: కాకినాడ – పిఠాపురం మార్గంలో తిమ్మాపురం వై జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెల్లవారు జామున ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారని, ప్రమాదం ఎలా జరిగిందో తెలియ లేదని రైటర్ ఆలీషా తెలిపారు. గాయపడిన వ్యక్తి చేతిపై సాదనాల యర్ర అప్పన్న అని పచ్చబొట్టు ఉందని కేసు నమోదు చేసినట్టు తిమ్మాపురం అదనపు ఎస్సై మూర్తి తెలిపారు.

విద్యార్థినికి విరాళం

బోట్‌క్లబ్: ప్రతిభగల విద్యార్థులకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అండగా ఉంటుందని చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. ఈ మేరకు నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న శీలం హైమకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేలు విలువ చేసే పుస్తకాలను శుక్రవారం అందించారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ–1	8008293994
ఎంఈఓ–2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్	9704512131
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	9492600313
కరప ఎస్ఐ	9440796557
తాళ్లరేవు ఎక్సైజు సీఐ	9440902407

మట్టికుండ.. చల్లగుండ!



- కుండ నీటితో వేసవి తాపానికి చెక్
- అనాది నుంచి చెక్కుచెదరని స్థానం
- ఊరూ వాడా సాగుతున్న వ్యాపారం



కుండకు తుది మెరుగులు అద్దుతున్న కుమ్మరి

కాకినాడ సిటీ: కాల చక్రంలో అన్నీ పునరావృతవుతాయనేది ఓ సిద్ధాంతం. కాకపోతే ఆధునికంగా రూపాంతరం చెందుతాయంతే. అది ఫ్యాషనైనా.. వినియోగవస్తువైనా.. మరేదైనా.. అప్పట్లో ఇలాంటివి వాడేవాళ్లం. మళ్లీ అవే ఇప్పుడు మార్కెట్‌లో కొత్త ట్రెండ్ అనే మాటలు నేడు సాధారణంగా వింటుంటాం. ఉదాహరణకు కుండలనే తీసుకుంటే పురాతన కాలం నుంచీ నిల్వ చేసుకునే వస్తువులలో కుండలదే అగ్రస్థానం. తినుబండారాలైనా.. తాగునీరైనా.. ఆఖరికి సంపదైనా. అప్పుడప్పుడు పురాతన తవ్వకాల్లో కుండలలో దాచిపెట్టిన బంగారు, వెండి నాణేల నిధులు బయటపడడం మనందరికీ తెలిసిందే. తరువాతి కాలంలో ఈ కుండలను కేవలం వంటలు చేసుకోవడానికి, తాగునీటి నిల్వకు వినియోగించేవారు. క్రమేణా వంట పాత్రలు వివిధ లోహాలతో రావడంతో కుండలను కేవలం నీటి కోసమే వినియోగించేవారు. ఎర్రమట్టి, నల్లమట్టి, బంకమట్టి, ఇలా వివిధ రకాల ఖనిజ విలువలు కలిగిన కుండలను ఆయా ప్రాంతాల్లో దొరికే మట్టిని బట్టి తయారు చేసేవారు. వాటిలో నిల్వ ఉంచిన నీరు ఎంతో శ్రేష్ఠమైనదని ఆయుర్వేద వైద్యులు చెప్పేవారు. తదనంతర కాలంలో ఫ్రిజ్‌ల వంటి ఆధునిక పరికరాలు వచ్చినా నేటికీ మట్టి కుండల వినియోగం ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా ఎండాకాలం వచ్చిందంటే కుండలో నీటిని తాగితే ఎంతటి ఉష్ణ తాపమైనా పటాపంచలు కావాల్సిందే. అదీ మట్టికుండలోని నీటి విలువ. పేద వారి ఫ్రిజ్‌గా ఎంత పేరున్నా నేటికీ పట్టణ ప్రాంతాల్లో పెద్దవారిళ్లలో సైతం కుండలలో నీరు నిల్వచేసి ఆ నీటిని మరికొద్ది చల్లదనం కోసం ఫ్రిజ్‌లోని సీసాల్లో పెడుతుండడం చూస్తూనే ఉన్నాము. అందుకు కారణం మట్టికుండలోని ఔషధ విలువలే అని నేటి వైద్యులు సైతం చెప్తున్నారు. కుమ్మరి చక్రంపై ఒడుపుగా ఎక్కడ ఎంత మందం, ఎంత పలచగా ఉండాలో అలా తయారు చేయడంలో నిపుణులైనవారెందరో నేటికీ అక్కడక్కడా ఆ వృత్తిని కొనసాగిస్తున్నారు.

పరిమాణాన్ని బట్టి ధర

ఒక్కో కుండ ధర దాని పరిమాణాన్ని బట్టి ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో మట్టితో తయారు చేసిన కుండలనే విక్రయిస్తుంటారు. సుమారు ఒక్కో కుండ రూ. 100 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

వేసవిలో కుండ నీరే తాగుతాం



వేసవి వచ్చిందంటే తప్పనిసరిగా కుండలు కొని వాటికి చుట్టూ గోనె, బట్ట ఏదైనా చుట్టి దానిని చల్లబరుస్తూ ఉంచి కుండలో నీరే తాగుతాం. దీని వల్ల దాహం తీరుతుంది. చల్లగా ఉంటుంది. ఫ్రిడ్జ్‌లో నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం కూడా ఉంది.

– బొజ్జా సాంబశివరావు, తూరంగి

ఆరోగ్యానికి దివ్యౌషధం



మట్టికుండలో నీరు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. పదేళ్లుగా మేము ఇంట్లో మట్టికుండను వాడుతున్నాం. వేసవి వచ్చిందంటే కుండ నీటికే ప్రాధాన్యం ఇస్తాం. ఫ్రిజ్ నీరు తాగితే దాహం తీరదు. అందుకే మట్టికుండ నీటిని తాగుతాం.

కె.సత్తిరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు, కాకినాడ

ఆకర్షిస్తున్న మట్టి పాత్రలు



కుండల తయారీదారులు సైతం ఆధునికను అందిపుచ్చుకుంటున్నారు. కేవలం మట్టితో ఓ కుండ చేసేసామన్నట్టు కాకుండా చేసిన కుండకు రంగులద్ది, డిజైన్లు తీర్చిదిద్ది ఆకర్షణీయంగా వివిధ రూపాల్లో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. రంగుల బాటిళ్లు, గ్లాసులు, కూజాలు, టీ కప్పులు, దోశ, చపాతీ పెనాలు, పువ్వులు అలంకరించి పెట్టే తొట్టెలు, పూల కుండీలు విక్రయానికి ఉంచుతున్నారు. ఇవి వినియోగదారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

ప్రయోజనాలెన్నో..



మట్టిలో ఎన్నో మినరల్స్, సాల్ట్స్ ఉంటాయి. అలాగే అందులో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎనర్జీ దాగి ఉంటుంది. మట్టితో తయారు చేసిన కుండలో నీటిని నిల్వ చేయడం వలన ఆ గుణాలన్నీ ఆ నీటిలో చేరతాయి. ఆ నీటిని తాగడం వల్ల వేసవిలో మనం కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. వేసవిలో ఎక్కువగా ఇబ్బంది పెట్టేది డీహైడ్రేషన్. మట్టి కుండలో నీరు తాగితే శరీరం డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్త పడవచ్చు. కుండలో నీటిని తాగితే శరీరంలోని గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచి వడదెబ్బ నుంచి మనల్ని కాపాడుతుంది. వేసవిలో కొంతమందిలో జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతుంటాయి.

19న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ సోమవారం వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో టెక్నికల్ సపోర్టు ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్, మోడిన్ థర్మల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అప్రెంటిస్, కేఎఫ్‌సీలో టీమ్ మెంబర్స్, ఇండో ఎంఐఎం, హుందాయ్ గ్లోవీస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ. 12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజన వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ ఈ నెల 19వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, కూటమి నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు శుక్రవారం నగరంలో స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బాలాజీచెరువు సెంటర్ వరకూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వంద అడుగుల జాతీయ జెండాతో భారత్ మాతాకీజై అంటూ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులు మాజీ సైనికులు, నాయకులును సత్కరించారు. ర్యాలీలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల సురక్ష జిల్లాగా కాకినాడ

- ఐఆర్‌సీఎస్ రాష్ట్ర చైర్మన్ రామారావు
- పడాల ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఆర్‌సీఎస్ రాష్ట్ర చైర్మన్ రామారావు

కరప: కాకినాడను బాలల సురక్ష జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలపై విస్తృతంగా ప్రచారంచేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అందుకు పడాల చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశావర్కర్లతో ఏర్పాటుచేసిన నూరుశాతం చైల్డ్ సేఫ్ డిస్ట్రిక్ట్–కాకినాడ, ప్రోగ్రాం లాంచ్–2025–26లో ఆయన మాట్లాడారు. మానవత్వంతో చేయూతనివ్వడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రెడ్‌క్రాస్ సంస్థ ముందుంటుందని, సేవలందించడంలో కాకినాడ జిల్లా శాఖ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాకినాడలో ఇటీవల రూ.1.3 కోట్లతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పామని, 29 ఏళ్లుగా ఐఆర్‌సీఎస్ ద్వారా అందిస్తున్న సేవలను రామారావు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికంగా బాగున్నా నైతికంగా పతనమవుతున్నామని పేర్కొని అందుకు బాలలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలే నిదర్శనమన్నారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పడాల సూర్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి బిడ్డ క్షేమంగా ఉండాలన్న తలంపుతో తమ సంస్థ అందరికీ అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పిల్లల రక్షణ ఐసీడీఎస్‌దే కాదని, అన్నిశాఖలు బాధ్యత తీసుకోవాలన్నారు. లైంగిక వేధింపులు, అత్యాచారాలను వివరిస్తూ ఏ వయసులో ఎవరు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించేందుకు, మండలస్థాయి కమిటీల ఏర్పాటుకు, బాలల రక్షణకు కలెక్టర్ షణ్మోహన్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను ఆయన వివరించారు. పడాల ట్రస్ట్ చేపట్టిన బాలల సురక్ష కార్యక్రమానికి ఐఆర్‌సీఎస్ సంస్థ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చినందుకు ట్రస్ట్ తరఫున సూర్యప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఒక చాలెంజ్‌గా తీసుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు చేరవేస్తామన్నారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డీఎల్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, పీహెచ్‌సీ డాక్టర్ వి.ఏంజలిన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను పరిరక్షించండి



సమావేశంలో అధికారులకు ఆదేశాలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

- ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు
- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: జిల్లాలో నీటి వనరులైన చెరువులు, కాలువలు, డ్రైన్లు, వాగులు తదితరాలు ఆక్రమణలకు, ధ్వంసానికి గురి కాకుండా కాపాడాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో నీటి వనరుల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ తొలి సమావేశం జేసీ మాట్లాడారు. ఆక్రమణలు, దుర్వినియోగాల వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారి తీయకుండా నివారించేందుకు రెవెన్యూ అధికారుల అధ్యక్షతన మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ తదితర శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఈ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా రికార్డులలో నమోదైన నీటి వనరులను పరిశీలించి ఆక్రమణలు జరగకుండా నిరోధించాలని ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్, కుడా యాజమాన్యంలో ఉన్న చెరువులకు కంచెలు ఏర్పాటు ద్వారా పరిరక్షించాలని ఆదేశించారు. కాలువలను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లోని జనావాసాల మురుగునీరు కాలువలు, చెరువుల్లోకి విడిచిపెట్టకుండా నిరోధించాలన్నారు. ఆక్రమణలకు సంబంధించి కోర్టు వివాదాల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి జిల్లాలోని నీటి వనరుల వివరాలు, వాటిలో జరిగిన ఆక్రమణలు, ఆక్రమణ విస్తీర్ణంలో ఉన్న పంటల సాగు, సివిల్ నిర్మాణాలు వివరాలు, కోర్టు వివాదాలు, ఇకపై ఆక్రమణలకు గురికాకుండా చేపట్టిన చర్యలపై సమగ్ర వివరాలతో హాజరు కావాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.వెంకటరావు, మున్సిపల్ పరిపాలన ఆర్డీ ఆర్.నాగనరసింహరావు, డీపీవో వి.రవికుమార్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేష గిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి, కౌడా, డ్రైనేజీ, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాంబ జాతర

- భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు
- గొంచాలలో భారీ అన్నదానం



గొంచాల గ్రామంలోని శ్యామలాంబ అమ్మవారు



ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో కొలువైన శ్యామలాంబ జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు ఆలయ కోనేరులో స్నానాలు చేసి అనంతరం నైవేద్యాలు పెట్టుకున్నారు. గ్రామంలో ప్రతి కుటుంబంలోని బంధువులతో ఆనందంగా గడిపారు. తెల్లవారు జామున తాడితో ఊరేగింపు నిర్వహించారు. గ్రామం అంతా ఊరేగింపు నిర్వహించిన తరువాత ఆలయం వద్ద తాడి గోతిలో పాతి తిప్పుతూ యువత ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి జాతర జరిగింది. ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద తిరునాళ్లు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం రోజున జాతర రావడంతో గొంచాల, నవర, పవర, చంద్రంపాలెం, అచ్చంపేట, పి.వేమవరం, ఉండూరు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులు సేవలందించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. ఈఓ కృష్ణారెడ్డిని ఆలయ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు.

21న అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: పెద్దాపురం పట్టణంలో ఈనెల 21వ తేదీన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో జిగిని లక్ష్మణరావు, వెంకట శేషవేణి దంపతులు, జిగిని రాజేష్‌ఖన్నా, గౌతమి దంపతులచే విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం స్వస్తివాచకం, సంకల్పం, పుణ్యాహవచనం, దీక్షాధారణ, క్షీరాధివాసం, ప్రధాన హోమం, గోపూజలు వేదపండితులు వాడపల్లి గోపాలచార్యులుచే జరుగుతాయని తెలిపారు. 22వ తేదీన హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఖేలో ఇండియాలో అచ్చంపేట విద్యార్థి

సామర్లకోట: బీహర్‌లో ఈనెల 13వ తేదీన జరిగిన ఖేలో ఇండియా యూత్ బ్యాడ్మింటన్‌లో మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ జోడి డబుల్స్‌లో విజయం సాధించి ప్రథమ బహుమతి పొందాడు. ఈ మేరకు హరికృష్ణ తండ్రి వీరంరెడ్డి పెదబాబు శుక్రవారం స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టి.రామ్‌చరణ్, వీరంరెడ్డి హరికృష్ణ జోడి, తమిళనాడుకు చెందిన విశ్వజిత్‌రాజ్, నీరంజన్‌పై 19–21, 21–19, 21–16 తేడాతో విజయం సాధించారన్నారు.

ఇంటర్ పరీక్షల పరిశీలన

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగు తున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల తీరును జిల్లా డైట్ డీఐఈడీ ఐ.శారద శుక్రవారం పరిశీలించారు. కళాశాలలో జరుగుతున్న పరీక్షలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రం వద్ద అమలవుతున్న 144 సెక్షన్‌ను ఆమె పరిశీలించి పోలీసులకు సూచనలిచ్చారు. శుక్రవారం పరీక్షకు 353 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ చంద్రు లీలాశ్రీదేవి డీఐఈడీకి తెలిపారు.

నూతన విధానాలతో రైతులకు మేలు

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

సామర్లకోట: రైతులు నూతన సాంకేతిక విధానాలను అమలు చేయడం ద్వారా మేలు జరుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎ.సీతారామశర్మ అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరం, వ్యవసాయ కళాశాలలోని విద్యార్థులకు వ్యవసాయ పరిశోధనలపై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు వ్యవసాయ నమూనాలు ప్రదర్శనకు ఉంచారు. వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించడం వల్ల ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సుధీర్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.దేవకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ దక్షిణామూర్తి, కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసు, తిమ్మాపురం, వడ్లమూరు, తాటిపర్తి అభ్యుదయ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



కరపలో ర్యాలీ చేస్తున్న అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది

కరప: గ్రామాల్లో డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు దోమల నివారణ చర్యలు తీసుకోవాలని డీఎల్‌ఓ (డిస్ట్రిక్ట్ లెప్రసీ ఆఫీసర్) డాక్టర్ ఆర్.రమేష్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలు దోమల నిరోధానికి చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ, రక్షిత నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం డెంగీ, దోమల నివారణ, డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, పీహెచ్‌సీ సిబ్బంది వై.నాగబాబు, ఏసురత్నం, డీవీవీ సత్యనారాయణ, కె.రాజ్‌గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తం

కాకినాడ రూరల్: సీజనల్‌గా వచ్చే డెంగీ జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల్లో డెంగీ తీవ్రమైనదని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించి డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

సామర్లకోట: పెద్దాపురం ఎక్సైజ్ అధికారులు శుక్రవారం వివిధ గ్రామాల్లో దాడులు చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పెద్దాపురం కోర్టులో హాజరు పరచినట్టు ఎక్సైజ్ సీఐ కేవీవీ దుర్గార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే గోవిందపురం గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 40 లీటర్ల సారాను, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని పెద్దాపురం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడులల్లో ఎక్సైజ్ ఎస్సై ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.